క్లుప్తంగా

ఎస్‌పీడీలో విస్తృత తనిఖీలు



సుసర్ల కాలనీజంక్షన్ వద్ద తనిఖీలు చేస్తున్న గోపాలపట్నం పోలీసులు

గోపాలపట్నం: నగరంలో చైన్ స్నాచింగ్ జరిగిన నేపథ్యంలో గోపాలపట్నం, ఎస్‌పీడీ ప్రాంతంలో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. బుచ్చిరాజుపాలెం ఎస్‌పీడీ ప్రాంతాల్లో ఎయిర్‌పోర్టు, గోపాలపట్నం పోలీసులు తనిఖీలు ప్రతీ వాహనాన్ని పరిశీలించారు. వాహన దారుని వివరాలు, వాహనం పత్రాలు పరిశీలించారు. అనుమానితులపై ప్రత్యేక దృష్టి సారించారు.

458 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఆశోక్‌నగర్ ఆంధ్ర బౌద్ధ సమాజ కేంద్రం బౌద్ధాలయంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంచరపాలెం జోనల్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం, ఓమ్ని ఆర్కే హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య నిపుణులు సుమారు 458 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బౌద్ధాలయం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్, ఆస్పత్రి సిబ్బంది, సంఘం సభ్యులు బల్లంకి వెంకటరావు, గంధ్రేడ్డి సన్యాసిరావు, అధ్యక్షుడు మల్లువలస రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు రాజబాబు, మల్లిబాబు, ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై భారం

సింధియా: పెరిగిన నిత్యావసరాల ధరలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని టీడీపీ నాయకురాలు తోట రత్నం ఆరోపించారు. జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతినగర్, చింతల్లోవ, కాకరలోవ తదితర ప్రాంతాల్లో ఆమె కార్యకర్తలతో కలిసి పర్యటించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో పాల్గొన్న పలువురు ఉభయదాతలు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో కె. రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

6న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 6న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

సౌత్ ఆసియా బాడీ బిల్డింగ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక : ఈ నెల 15, 16 తేదీల్లో గాజువాకలో నిర్వహించనున్న సౌత్ ఆసియా బాడీ బిల్డింగ్ పోటీల పోస్టర్‌ను కిక్‌బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వివిధ దేశాల నుంచి 200 మంది బాడీ బిల్డర్లు పాల్గొంటున్న ఈ పోటీలను గాజువాకలో నిర్వహించడం అభినందనీయమన్నారు. విశాఖ బాడీ బిల్డర్లందరూ ఈ పోటీలను జయప్రదం చేయడానికి సహకరించాలని కోరారు.

ఇంకెన్నాళ్లీ కష్టాలు!



ఆర్పీపేట రైల్వే గేటు సమీపంలో రైలు ఉండగానే.. పక్క నుంచి వస్తున్న స్థానికులు



కంచరపాలెం దయానందనగర్ సమీపంలో పట్టాలు దాటుతున్న కాలనీ వాసులు

- రైలు పట్టాలపై కంచరపాలెం వాసుల రాకపోకలు
- అండర్ పాత్‌వే నిర్మాణానికి వినతులు

కంచరపాలెం: రైలుపట్టాలపై ప్రమాదకర పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు కంచరపాలెం వాసులు. దయానంద నగర్ సమీపంలో గూడ్స్ రైళ్లు, రామ్మూర్తి పంతులపేట రైల్వే గేటు సమీపంలో ప్రమాదపుటంచున ప్రయాణిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

కంచరపాలెం ప్రధాన రహదారి నుంచి రెండు కిలో మీటర్ల దూరాన రైలు పట్టాలకు అవతలి నివాసిత ప్రాంతాలైన ముత్యమాంబ కాలనీ, రాజీవ్‌కాలనీ, చాకలిగెడ్డ తదితర కాలనీల నుంచి బయటపడాలంటే వరుసగా ఆరేడు లైన్ల రైల్వే ట్రాకులు దాటాలి. రామ్మూర్తిపంతులపేట, గవర కంచరపాలెం, ధోబీ లైన్ గొల్లకంచరపాలెం కంచరపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డుకు రావాలంటే రెండు మూడు ట్రాకులను దాటాలి. రక్షణ లేని రైలు ట్రాకుల్ని దాటి గమ్యస్థానాలను చేరేందుకు పిల్లలు, పెద్దలు, వృద్ధులని తేడా లేకుండా ప్రతీ ఒక్కరూ ఇక్కడ ఫీట్లు చేయాల్సిందే. ఆయా ప్రాంతాలకు వచ్చే అతిథుల పరిస్థితి మరీ దారుణం. రైల్వే ట్రాక్‌లపై అవగాహన లేని ఆయా కాలనీవాసులకు చెందిన బంధువులు ప్రమాదాల బారిన పడి మరణిస్తున్న ఘటనలూ ఉంటున్నాయి. రైలింజన్ల నిర్వహణ, మరమ్మతుల విభాగాలూ, రైల్వే బోగీల వాషింగ్ ఇక్కడే ఏర్పాటు చేయడంతో రోజులో అన్ని సమయాల్లో రైళ్లు తిరుగుతుంటాయి. గతంలో పాదచారులకు ఆర్పీ పేట వద్ద అండర్‌పాత్‌వే నిర్మించారు. కానీ రహదారి నిర్వహణ అంతంత మాత్రం కావడంతో వాహనచోదకులకు మాత్రమే ఈ మార్గం అనువుగా ఉంది. పాదచారులు అటుగా నడవడానికి మొగ్గు చూపడంలేదు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా రైల్వే ట్రాకులు దాటుతూ ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతున్నారు. కొన్ని ఘటనల్లో మరణిస్తున్నారు. లోకోషెడ్ సమీపంలో అండర్ పాత్‌వే నిర్మిస్తే 5, 6 కాలనీలవాసులకు అనువుగా ఉంటుందని తెలియజేస్తున్నారు. ప్రతిపాదన దశలో ఉన్న ఈ నిర్మాణాన్ని కార్యరూపంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అండర్ పాత్ వే నిర్మించాలి

మా కాలనీలకు వెళ్లాలంటే కిలో మీటర్ల మేర ప్రమాదకర పరిస్థితుల్లో నడవాల్సి వస్తోంది. పాదచారుల కోసం అండర్ పాత్ వే నిర్మించాలి. సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందించాం. మా సమస్య పరిష్కరించాలి

– సంతోష్‌కుమార్, రాజీవ్ కాలనీ, కంచరపాలెం

అధికారులకు విజ్ఞప్తి చేసినా..

అండర్ పాత్ వే నిర్మాణం కోసం రైల్వే ఉన్నతాధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాం. రైలు పట్టాలు దాటాలంటే నిత్యం భయమే. ప్రమాదాలు జరుగుతున్నా అధికారుల్లో స్పందన కనిపించడం లేదు. పిల్లల్ని బయటకు పంపాలంటే భయంగా ఉంటోంది. అధికారులు స్పందించి అండర్ పాత్‌వే నిర్మాణానికి కృషి చేయాలి.

– నూకరాజు, దయానంద నగర్, కంచరపాలెం

జగనన్నే మన భవిష్యత్తుపై దిశా నిర్దేశం



సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: జగనన్నే మన భవిష్యత్తు నినాదం ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన పార్టీ కార్యాలయంలో 56,57,52,89,90,91,92 వార్డుల కార్పొరేటర్లు, అధ్యక్షులు, ముఖ్య నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులుకు జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమంపై దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మాట్లాడాలని, వారి సమస్యలు తెలుసుకోవాలని పార్టీ శ్రేణులకు తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న అభివృద్ధి గురించి వివరించాలన్నారు. పథకాలు అందని వారుంటే తక్షణమే తమకు తెలియజేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ నెల 8 నుంచి జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో కార్యకర్తలు, నాయకులు నిత్యం ప్రజల్లో ఉండాలని, జగనన్నను ముఖ్యమంత్రిని చేసేంత వరకు సైనికుల్లా పోరాడాలని పిలుపునిచ్చారు. ఎన్నికల పరిశీలకుడు ఎస్‌ఏ రెహ్మాన్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 97 శాతం హామీలు అమలు చేసిన ఘనత దేశంలో ఆయనదే అన్నారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ ఎంఎస్‌ఎంఈడీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆనంద్‌కుమార్‌ను ఎస్‌ఏ రెహ్మాన్, జియ్యాని శ్రీధర్ తదితరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, కార్పొరేటర్ ముర్రు వాణి, వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్ బీఎస్ కృష్ణ, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ బాకి శ్యామ్‌కుమార్‌రెడ్డి, సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యురాలు శ్రీదేవి వర్మ, వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు, చుక్క ప్రసాదరెడ్డి, అప్పలస్వామి నాయుడు, దొడ్డి కిరణ్, సీనియర్ నాయకులు నమ్మి శ్రీను, అయితంశెట్టి గోపి, సచివాలయ క్లస్టర్ కన్వీనర్లు పల్ల ఎర్నికుమార్, గేదెల మురళీకృష్ణ, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ



లబ్ధిదారుడికి పింఛన్ అందిస్తున్న కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం : జీవీఎంసీ 58వ వార్డు పరిధి పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ గులిగిందల లావణ్య వలంటీర్లతో కలిసి లబ్ధిదారులకు ఫించన్లు అందజేశారు. ములగాడ వద్ద జరిగిన పింఛన్ల పంపిణీలో ఆమె మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మన జగనన్న ప్రభుత్వం అన్నారు. ఆయన పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న ప్రతి ఒక్కరు జగనన్నను ఆశీర్వదించాలన్నారు. పిలకవానిపాలెం, గొందేశివానిపాలెం, ఎదురువానిపాలెం తదితర ప్రాంతాల్లో కూడా పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సేవా మార్గంలో పార్కింగ్‌తో సమస్యలు



సెయింట్ ఆన్స్ కళాశాలకు వెళ్లే మార్గంలో పార్క్ చేసిన వాహనాలు

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు పరిధి సెయింట్ జోసెఫ్ స్కూల్ నుండి సెయింట్ ఆన్స్ కళాశాలకు వెళ్లే సేవామార్గంలో కార్లు, ఆటోలు, మినీ బస్సులను పార్కు చేస్తున్నారు. దీంతో ఉదయం ఆఫీసులు, స్కూళ్ల సమయంలో ఇక్కడ ట్రాఫిక్ జామ్ అయి పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని నెలల నుండి ఈ సమస్య నెలకొని ఉన్నా అధికారులు మాత్రం స్పందించటం లేదు. దీంతో జనతాకాలనీ నుండి ఆర్‌కేపురం వచ్చేవారు, ఆర్‌కేపురం నుండి జనతాకాలనీ, ఇండ్రస్ట్రియల్ కాలనీ వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యపై స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

వేతన ఒప్పందం అమలుకు డిమాండ్



ధర్నాలో ప్రసంగిస్తున్న సీఐటీయూ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నూతన వేతన ఒప్పందం చేయాలని స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు వై.టి.దాస్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై స్టీల్ సీఐటీయూ మిత్రపక్షాల ఆధ్వర్యంలో స్టీల్ మెల్ట్ షాప్ విభాగాధిపతి కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈవోఐను కార్మికవర్గం ఐక్యంగా వ్యతిరేకించాలని కోరారు. అనంతరం విభాగాధిపతి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. మిత్రపక్షాల నాయకులు డి.వి.రమణారెడ్డి, కర్రా ప్రకాశ్, బి. అప్పారావు, మరిడయ్య పాల్గొన్నారు.

ఘనంగా కోలాట మండలి వార్షికోత్సవం



సత్కారం అందుకున్న వారితో ఆహూతులు, కమిటీ సభ్యులు

గోపాలపట్నం: శ్రీ శ్రీనివాస సంకీర్తన కోలాట మండలి పదో వార్షికోత్సవాన్ని కరాసా వేమన మందిరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస సంకీర్తన కోలాట మండలి అధ్యక్షురాలు చల్ల మంజుల మాట్లాడుతూ అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని సంస్థకు అనుబంధంగా తమ మండలి ఏర్పడిందని చెప్పారు. పదేళ్లు పూర్తి చేసుకుని 11వ వసంతంలోకి అడుగు పెట్టిందన్నారు. అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని వ్యవస్థాపకుడు తిమ్మపాతిని చక్రవర్తి సౌజన్యంతో ఈ స్థాయికి ఎదిగిందని కొనియాడారు. రెండు సంస్థల ద్వారా హిందూ ధర్మ ప్రచారం చేస్తున్నామని తెలిపారు. తిరుపతి, శ్రీశైలం, అన్నవరం, సింహాచలం వంటి పలు పెఎద్ద దేవాలయలతో పాటు పలు కార్యక్రమాల్లో కోలాటాలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నామన్నారు. వార్షికోత్సవం సందర్భంగా మూడు రైతు కుటుంబాలను, వీర సైనికుల కుటుంబాలను, జీవీఎంసీ పారిశుధ్య మహిళా కార్మికులను సత్కరించారు. మాతృ సంస్థతో అనుబంధం ఉన్న 30 సంస్థల అధ్యక్ష కార్యదర్శులకు పాద పూజ చేసి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు, నాయకులు గుణిశెట్టి శ్రీనివాసరావు, సురేష్, వెంకటరమణ. చిట్టిబాబు, కమిటీ సభ్యులు వెంకటి రూప, పద్మ, వాణి, విజయ, కృష్ణ వేణి, తులసి, కళ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతల బాధ్యత ఆశ వర్కర్లదే



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పురేంద్ర

కంచరపాలెం: గర్భిణులు, బాలింతల ఆరోగ్యం పట్ల ఆశ వర్కర్లు చిత్తశుద్ధితో పని చేయాలని డీటీసీవో ప్రోగ్రాం అధికారి డాక్టర్ పురేంద్ర అన్నారు. మంగళవారం భవానీ గార్డెన్స్‌లోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో శివనగర్, ఆర్పీ పేట, భవానీ గార్డెన్స్ యూపీహెచ్‌సీల ఆశ వర్కర్లతో ×ఆశ డే౹కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లు క్లస్టర్లలో మహిళల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవాలన్నారు. పౌష్టికాహారానికి సంబంధించిన సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఏఎల్ శాంతి, ఏఎం ఏంజెలినా, పీఆర్‌వో శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

సర్వజన మనోరంజనిపై అప్పన్న తిరువీధి



సర్వజన మనోరంజనిపై తిరువీధిలో అప్పన్న



వేణుగోపాలస్వామిగా అప్పన్న

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామికి సర్వజన మనోరంజని వాహనంపై తిరువీధి వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేణుగోపాలస్వామిగా అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా మనోరంజని వాహనంపై అధిష్ఠంపజేసి సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు తిరువీధిలో స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు పవన్‌కుమార్, కుమార్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కళాకారిణుల నృత్యప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

ఉక్కు పోరాటం భావితరాలకు మార్గదర్శకం



రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఉక్కు కర్మాగార పరిరక్షణకు కార్మికులు చేస్తున్న పోరాటం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 782వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ ఎంతో మంది ప్రత్యక్షంగా, లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు గత వారం ఢిల్లీలో ప్రధాన రాజకీయ పార్టీల నాయకులను కలిశామని, ఉక్కు పరిరక్షణకు సహకరించాలని విన్నవించామని తెలిపారు. ఉక్కు పరిరక్షణకు భవిష్యత్ కార్యాచరణలో భాగంగా ఏప్రిల్ 10వ తేదీన ఉదయం 10 గంటలకు బీఆర్‌ఎస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ కూర్మన్నపాలెంలో టెంట్ వద్దకు వస్తున్నారని తెలిపారు. ఏప్రిల్ 15వ తేదీన పాదయాత్ర ఉంటుందని చెప్పారు. ఏప్రిల్ 25న సీఎండీ బంగ్లాను ముట్టడిస్తామని, ఈ కార్యక్రమాల్లో కార్మికులు, ఉక్కు నిర్వాసితులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీకి తరలిన సీఐటీయూ శ్రేణులు



ఢిల్లీ బయల్దేరుతున్న స్టీల్ సీఐటీయూ కార్యకర్తలు, నాయకులు

ఉక్కునగరం: స్టీల్ సీఐటీయూ శ్రేణులు చలో ఢిల్లీకి తరలి వెళ్లారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశ వ్యాప్తంగా బుధవారం ఢిల్లీలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం తలపెట్టాయి. ఇందులో భాగంగా సీఐటీయూ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు బయల్దేరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ అటు కార్మికులను, ఇటు కర్షకులను నట్టేట ముంచుతోందన్నారు. ఆంధ్రుల హక్కు అయిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు కట్టపెట్టాలని కుట్ర చేస్తోందన్నారు. కేంద్రం వైఖరికి వ్యతిరేకంగా తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కె.ఎం. శ్రీనివాస్, యు.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలమాంబ.. పాహిమాం

- వైభవంగా శ్రీకరకచెట్టు పోలమాంబ మహోత్సవం
- అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



ఆలయంలో క్యూలైన్లలో వేచి చూస్తున్న భక్తులు



వివిధ వేషధారణతో అలరిస్తున్న విన్యాసాలు

ఏయూ క్యాంపస్ : శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మ వారి పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మద్దివారివీధిలోని పెద్దిల్లు నుంచి అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువచ్చి పోలమాంబ ఆలయంలో అధిష్ఠంపజేసి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. సోమవారం అర్ధరాత్రి నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. చుట్టు పక్కల 14 గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో, ధర్మకర్తల మండలి సభ్యులు, పెదవాల్తేరు గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం నుంచి పోలమాంబ ఆలయానికి వెళ్లే మార్గం సందడిగా మారింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కొంత మంది ఘటాలను తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఆలయం నుంచి పెదవాల్తేరుకు వెళ్లే మార్గంలో విద్యుత్ దీపాలంకరణ చేశారు. రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు ఆట వస్తువులు, చెరకుగడలు, బొమ్మల విక్రయ స్టాళ్లు ఏర్పాటు చేశారు.

అమ్మవారి సన్నిధిలో ప్రముఖులు

పోలమాంబ అమ్మవారిని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి దంపతులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జాతర కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.